ఉపకార వేతనం.. భవితకు ఊతం

- రేపు ఎన్ఎంఎంఎస్ అర్హత పరీక్ష
- జిల్లా వ్యాప్తంగా 837 మంది విద్యార్థులు హాజరు

పెద్దవంగర: చదువుకోవాలనే తపన ఉన్నా ఆర్థిక స్థోమత లేక ఎంతో మంది విద్యార్థులు తమ చదువులను అర్థాంతరంగా ఆపేసిన సంఘటనలు ఉన్నాయి. ఈనేపథ్యంలో ప్రతిభ ఉన్న విద్యార్థులకు ప్రభుత్వం ఊతం అందిస్తోంది. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ ఏటా నవంబర్‌లో జాతీయ మాధ్యమిక ప్రతిభ ఉపకార వేతన పరీక్షలు నిర్వహిస్తోంది. ఇందులో ప్రతిభ కనబర్చిన వారికి ఏటా రూ.12వేలు చొప్పున తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకు నాలుగేళ్లపాటు ఉపకారం వేతనం అందిస్తారు. ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థులు అర్హులు. రేపు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలికల పాఠశాలతోపాటు తొర్రూరు డివిజన్ కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలతో పాటు సెయింట్ పాల్స్ హైస్కూల్‌ల్లో పరీక్ష జరగనుంది. జిల్లా వ్యాప్తంగా 837 మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ పరీక్షలకు హాజరుకానున్నారు.

మార్కులు ఇలా..



విద్యార్థులను పరీక్షకు సన్నద్ధం చేస్తున్న గైడ్ టీచర్

ఇందులో మొత్తం 180 మార్కులు ఉంటాయి. పరీక్షలు రెండు విభాగాల్లో ఉంటాయి. మొదటిది(పార్టు -1) మానసిక సామర్థ్య పరీక్ష 90 ప్రశ్నలు 90 మార్కులు. ఇందులో రీజనింగ్ ఎబిలిటీస్, సంఖ్యా శాస్త్రం, పదాల భిన్న పరీక్ష, నంబర్ అనాలజీ, అల్ఫాబెట్ అనాలజీ, కోడింగ్–డీకోడింగ్, లాజికల్ ప్రశ్నలు, వెన్ చిత్రాలు, మిర్రర్, వాటర్ మెసేజెస్ వంటి పలు ప్రశ్నలు ఉంటాయి. పార్టు -2 ఏడు, ఎనిమిది తరగతుల నుంచి 90ప్రశ్నలు 90 మార్కులు ఉంటాయి. భౌతిక, రసాయన, జీవశాస్త్రం కలిపి 35 మార్కులు, గణితంలో 20 మార్కులు, సాంఘిక శాస్త్రంలో 35మార్కులు. పరీక్ష ఆంగ్ల, తెలుగు, మాధ్యమాల్లో ఉంటాయి. జిల్లా నుంచి 100 మంది పరీక్షలు రాయనున్నారు.

ఉన్నత చదువులకు బాసట



ఉపకార వేతనం మధ్య తరగతి, పేద కుటుంబాల విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతోంది. పెరిగిన ఖర్చుల దృష్ట్యా విద్యార్థుల అభ్యసన సామగ్రికి ఉపకార వేతనం తోడ్పడుతుంది. భవిష్యత్‌లో పాల్గొనే పోటీ పరీక్షల్లో రాణించేందుకు దోహదపడతాయి. విద్యార్థులను ఉపాధ్యాయులు సాధన చేయించారు.

– బుదారపు శ్రీనివాస్, ఎంఈఓ, పెద్దవంగర

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

పరీక్ష ఉదయం 9:30 నుంచి 12:30 వరకు ఉంటుంది. విద్యార్థులు అర గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి. ఓఎంఆర్ పత్రంలో వివరాలు జాగ్రత్తగా నింపాలి. సమయం పూర్తి అయ్యేవరకు కేంద్రంలోనే ఉండాలి. సెల్‌ఫోన్, స్మార్ట్ వాచ్ తదితర ఎల్రక్టానిక్ వస్తువులు పరీక్ష కేంద్రంలోకి తీసుకెళ్లకూడదు. పరీక్ష అయిపోయిన తర్వాత ప్రశ్నపత్రం ఇన్విజిలేటర్‌కు ఇవ్వాలి.

డేటా ఎంట్రీ వేగవంతం చేయాలి

- జిల్లా డిప్యూటీ జెడ్పీ సీఈఓ నర్మద

గార్ల/డోర్నకల్: సమగ్ర కుటుంబ సర్వే దరఖాస్తుల డేటా ఎంట్రీ నమోదును వేగవంతం చేయాలని జిల్లా డిప్యూటీ జెడ్పీ సీఈఓ నర్మద, డీపీఓ హరిప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం గార్లలో ప్రారంభమైన దరఖాస్తుల డేటా ఎంట్రీ నమోదు కేంద్రాలను వారు సందర్శించారు. గార్లలోని ఎంపీడీఓ కార్యాలయం, డిగ్రీ కళాశాలలో రెండుచోట్ల దరఖాస్తుల డేటా ఎంట్రీ నమోదు ప్రక్రియ ప్రారంభమైనట్లు ఎంపీడీఓ మంగమ్మ వెల్లడించారు.

దంతాలపల్లి: ఇటీవల ప్రభుత్వం చేపట్టిన ఇంటింటా సర్వే వివరాలను ఎంట్రీ చేయాలని ఎంపీడీఓ వివేక్‌రామ్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం డేటా ఎంట్రీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

తొర్రూరు: సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో పక్కాగా నమోదు చేయాలని ఎంపీడీఓ నర్సింగరావు తెలిపారు. 16,648 కుటుంబాలను సర్వే చేస్తున్నామని, 90శాతం సర్వే పూర్తయిందన్నారు.



గార్ల: తనిఖీ చేస్తున్న డిప్యూటీ సీఈఓ నర్మద

నెల్లికుదురు: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఆన్‌లైన్ ఎంట్రీ కార్యక్రమం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల ప్రత్యేక అధికారి జినుగు మరియన్న ఎంపీడీఓ బాలరాజుతో కలిసి ప్రారంభించారు.

దివ్యాంగుల హామీలను నెరవేర్చాలి



మాట్లాడుతున్న బాలునాయక్

మహబూబాబాద్ అర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన దివ్యాంగుల హామీలను నెరవేర్చాలని బీజేపీ గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బాలు నాయక్ డిమాండ్ చేశాడు. జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపడుతున్న రిలే దీక్షకు శుక్రవారం బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా బాలునాయక్ మాట్లాడుతూ.. దివ్యాంగులకు రూ.4వేల నుంచి రూ.6వేల వరకు పింఛన్ పెంపు చేయాలని, వితంతువులకు, వృద్ధులకు కూడా రూ 2వేల నుంచి రూ.4వేల వరకు పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎమార్పీఎస్ రాష్ట్ర నాయకుడు గుగ్గిళ్ల పీరయ్య, బీజేపీ గిరిజన మోర్చా అధికార ప్రతినిధి అజ్మీర శ్రీకాంత్, నాయకులు శ్యామ్‌ప్రసాద్, వెంకన్న, నారాయణ, సహదేవులు, నవీన్, రేణుక, దేవ్‌సింగ్ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మాధవి

నెహ్రూసెంటర్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా మాధవి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ విధానాలతో కార్పొరేట్, ప్రైవేట్ రంగ సంస్థలే ప్రయోజనాలు పొందుతున్నాయని విమర్శించారు. కార్మిక సంఘాలు పోరాడి సాధించుకున్న హక్కులు నాలుగు లేబర్ కోడ్ చట్టాలతో నీరుగారిపోతున్నాయని కార్మిక వర్గానికి నష్టం కలిగిస్తున్న లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు ఉపేందర్, రాజు, నాగన్న, రాజమౌళి, నాగన్న, స్నేహబిందు, సంపూర్ణ, జయరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాధవి

మరుగుదొడ్లను వినియోగించుకోవాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లను వినియోగించుకోవాలి కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం డీఆర్డీఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన్ రాజ్ అధ్యక్షతన ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం పురస్కరించుకొని సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి మరుగుదొడ్ల నిర్వహణలో ఉన్న ఉత్తమ టాయిలెట్స్‌ను గుర్తించి బహుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాలో అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లను డిసెంబర్ 10వరకు పూర్తి చేయాలన్నారు. మన మరుగుదొడ్లు- మన ఆత్మ గౌరవం అనే నినాదంతో ముందుకు సాగాలన్నారు. అనంతరం గ్రామపంచాతీలలో ఉత్తమ శానిటైజేషన్ వర్కర్లను గుర్తించి సన్మానించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ పురుషోత్తం, డీపీఓ హరిప్రసాద్, డీఆర్డీఓ, ఏసీబీఎం కన్సలెంటెంట్ శ్రావణ్, రవికుమార్ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

తృటిలో తప్పిన ప్రమాదం

మరిపెడ: ఎదురుగా వస్తున్న హార్వెస్టర్‌ను తప్పించబోయి కారు రోడ్డు కిందికి దూసుకెళ్లిన సంఘటనలో భార్య, భర్తలకు తృటిలో ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. డోర్నకల్ మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన బానోతు శివాజీ భార్య కౌసల్యతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో మున్సిపాలిటీ పరిధిలోని బీఎస్ఎన్ఎల్ సెల్‌టవర్ సమీపంలో ఎదురుగా వస్తున్న హార్వెస్టర్‌ను తప్పించబోయి దూసుకెళ్లి రోడ్డు కిందికి దిగింది. కారులో ఉన్న ఇద్దరికి బెలూన్‌లు ఓపెన్ కావడంతో ఎలాంటి గాయాలు కాలేదు. దీంతో తృటిలో ప్రమాదం తప్పింది.

ముగింపు ఉత్సవాలు

కేసముద్రం: మండలంలోని అమీనాపురం గ్రామంలో గల మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుజాత, లైబ్రేరియన్ సంధ్యారాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



ఐఎన్‌టీయూసీలో చేరుతున్న కార్మికులు

గార్ల: చాలీచాలని కూలీ డబ్బులతో జీవనం సాగిస్తున్న హమాలీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక వర్తక సంఘం భవనంలో హమాలీ కార్మికుల సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన హమాలీ కార్మికులు కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఐఎన్‌టీయూసీ కార్మిక సంఘంలో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు, సుందర్, యాకూబ్‌పాషా, అనిల్, కృష్ణ, రాంబాబు, సీతారాములు, సంతోష్, రాందాస్, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

- మార్కెట్ చైర్మన్ తిరుపతిరెడ్డి

తొర్రూరు: కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని తొర్రూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి అన్నారు. డివిజన్ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ చైర్మన్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ గుగులోతు భట్టు నాయక్, మార్కెట్ కార్యదర్శి నిరంజన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, డైరెక్టర్లు అచ్చిరెడ్డి, వెంకటాచారి, సంధ్యారాణి పాల్గొన్నారు.

మహబూబాబాద్ రూరల్: ప్రభుత్వం రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని డీఆర్డీఏ సెర్ప్ ఐకేపీ ఏపీఎం తిలక్ అన్నారు. మండలంలోని రెడ్యాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం తిలక్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రంజిత్, రమేశ్, రైతులు పాల్గొన్నారు.



తొర్రూరు: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తిరుపతిరెడ్డి

విద్యార్థినుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

నెల్లికుదురు: ఆశ్రమ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థినుల ఆర్యోగంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండల ప్రత్యేక అధికారి జినుగు మరియన్న ఆశ్రమ పాఠశాలల నిర్వహకులకు సూచించారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కేజీబీవీ ఆశ్రమ పాఠశాలల్లో శుక్రవారం ఎంపీడీఓ బాలరాజుతో కలిసి సందర్శించి పరిశీలించారు. ఆశ్రమ పాఠశాలల్లో మరుగుదొడ్లు, వంటశాలలు, వంట సామగ్రి స్టాక్ రూంలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాస్టళ్లలో చదువుకుంటున్న పిలల్లకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుమలత, వైద్య సిబ్బంది, ఆశ్రమ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న అధికారులు

గ్రంథాలయాన్ని కొనసాగించాలని నిరసన

తొర్రూరు రూరల్: మండలంలోని అమ్మాపురం గ్రామంలో నిర్మించిన గ్రంథాలయాన్ని కొనసాగించాలని కోరుతూ గ్రామస్తులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి డొనక దర్గయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని అంగన్‌వాడీ సెంటర్‌కు కొన్ని నెలలుగా వినియోగిస్తున్నారని, తద్వారా గ్రంథాలయానికి నిత్యం వచ్చే నిరుద్యోగులు, విద్యార్థుల ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అంగన్‌వాడీ సెంటర్ రద్దు చేసి, గ్రంథాలయ నిర్వహణను కొనసాగించాలని సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు.

దుకాణంలో అగ్నిప్రమాదం

గార్ల: గార్లలోని ఓ ఆటో మొబైల్ దుకాణంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి దుకాణంలోని రూ.1.50లక్షల విలువ గల సామగ్రి కాలిపోయిందని యజమాని గజ్జి రామయ్య తెలిపాడు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉదయం 9గంటలకు దుకాణం తీసి దీపం వెలిగించి, పని నిమిత్తం షటర్ మూసి బయటికి వెళ్లినట్లు తెలిపాడు. దుకాణంలో ఎలుకలు ఉండటంతో దీపంను కిందపడేయడం వలన ప్రమాదవశాత్తు ఇంజన్ ఆయిల్ డబ్బాలకు నిప్పంటుకొని ప్రమాదం జరిగినట్లు బాధితుడు పేర్కొన్నాడు.

ప్రజలను చైతన్యం చేయాలి

నెహ్రూసెంటర్: పాలకవర్గాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై కళల ద్వారా ప్రజల్లో చైతన్యం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సూర్నపు సోమయ్య అన్నారు. ప్రజానాట్య మండలి జిల్లా కమిటీ సమావేశం అల్వాల రామకృష్ణ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీనివాస్, వెంకన్న, స్వామి, నాగరాజు, మల్లేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారిగా మంజుల



మహబూబాబాద్ అర్బన్: టీఎస్ యూటీఎఫ్ కేజీబీవీ విభాగం నుంచి రాష్ట్ర కోశాధికారి ఎం. మంజులను ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఏ.మురళీ కృష్ణ, యాకూబ్ శుక్రవారం తెలిపారు.

రాష్ట్ర కార్యదర్శిగా పరశురాములు

గూడూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. పరుశురాములు రాష్ట్ర ప్రిన్సిపాల్ సంఘం కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. శుక్రవారం కళాశాలలో సహచర ఉద్యోగులు ప్రిన్సిపాల్ శాలువాతో సన్మానించారు.

డీఈఓను కలిసిన ఉపాధ్యాయులు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో నూతన డీఈఓ ఏ.రవీందర్‌రెడ్డిని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయులు సంఘం నాయకులు శుక్రవారం మార్యాదపూర్వకంగా కలిసి బొకేను అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు వీరస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి భద్రునాయక్, కార్యదర్శి మహేందర్, వైస్ ప్రెసిడెంట్ రజిత పాల్గొన్నారు.

జిల్లాస్థాయికి ఎంపిక



కేసముద్రం: చెకుముకి మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌లో కేసముద్రంవిలేజ్ శ్రీవివేకవర్ధిని హైస్కూల్‌కి చెందిన విద్యార్థులు ఎస్‌డి.హర్షియా, ఓంసాయి, లోకేష్ ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయికి ఎంపికైనట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు, కరస్పాండెంట్ చిత్రయాకాంతంగౌడ్ శుక్రవారం తెలిపారు.

నేటినుంచి రాష్ట్రస్థాయి క్రీడలు

కేసముద్రం: మండలంలోని కల్వల గ్రామ జెడ్పీ హైస్కూల్‌లో నేటినుంచి 25వ వరకు రాష్ట్రస్థాయి 68వ ఎస్‌జీఎఫ్ అండర్–17 బాల బాలికల నెట్‌బాల్ పోటీలు, అండర్–19 విభాగం కింద గట్కా క్రీడలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉమ్మడి పదిజిల్లాల నుంచి సుమారు 400మంది క్రీడాకారులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరేందర్, పీడీ కొప్పుల శంకర్, పీఎస్ హెచ్‌ఎం కల్లెం వీరారెడ్డి, ఏకాంబ్రం, సదానందం పాల్గొన్నారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు

డోర్నకల్: సీరోలు మండలం మన్నెగూడెం గ్రామంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరపడం స్థానికంగా కలకలం రేపింది. గ్రామానికి చెందిన ఓ వీధిలో కొద్ది రోజులుగా బయట ప్రాంతానికి చెందిన వ్యక్తులు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. స్థానికుల సమాచారం మేరకు శుక్రవారం వీధిలో పరిశీలించగా తవ్వకాలు జరిపిన ప్రాంతంలో లోతైన గుంత కనిపించింది.

పత్తి మిల్లు సందర్శన

దంతాలపల్లి: నర్సింహులపేట మండలం పడమటిగూడెం స్టేజీ వద్ద ఉన్న బాలాజీ పత్తి మిల్లును వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య శుక్రవారం సందర్శించారు. ఇటీవల వరంగల్ జిల్లా రాయపర్తి ఎస్‌బీఐలో జరిగిన చోరీ కేసు విచారణలో భాగంగా వచ్చినట్లు సమాచారం. ఇతర రాష్ట్రాల నుంచి పత్తి మిల్లులో కూలీల వివరాలు తెలుసుకున్నారు. అలాగే మండలంలో ఇతర ప్రాంతాల్లో పనులు చేస్తున్న వారి వివరాలను ఆరా తీసినట్లు తెలుస్తుంది. ఆయన వెంట దంతాలపల్లి ఎస్సై రాజు, సిబ్బంది ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

తొర్రూరు రూరల్: గ్రామీణ ప్రాంతాలు, గిరిజన తండాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తొర్రూరు మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమాండ్ల తిరుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దమంగ్యా తండాకు వేళ్లే రోడ్డుకు ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి మంజూరైన రూ.5లక్షలతో రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, జాటోతు రవి, మంగ్యానాయక్, సంతోష్, రాంలాల్ పాల్గొన్నారు.

రైతులపై దాడి సరికాదు

చిన్నగూడూరు: లగచర్లలో రైతుల మీద దాడిని ఖండిస్తూ రాష్ట్ర ప్రభుత్వ నియంతృత్వ నిర్బంధ పాలనను విడనాడి ప్రజాపాలనగా కొనసాగాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గునిగంటి మోహన్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జక్కుల లింగయ్య, బండి శ్రీనివాస్, రామేశ్వరం, కందుకూరి సుధాకర్, వెంకన్న పాల్గొన్నారు.

పంటల మార్పిడితో లాభాలు

నెల్లికుదురు: పంటల మార్పిడితో అధిక లాభాలు వస్తాయని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న రైతులకు సూచించారు. మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లి జామతోట, మండలంలోని వివిధ గ్రామాల కొనుగోలు కేంద్రాలను శుక్రవారం సందర్శించి పరిశీలించారు.

సంక్షిప్త సమాచారం

క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించాలి



మహబూబాబాద్ అర్బన్: క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించాలని జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ బాస నాగమని అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం జిల్లాస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్ ఎంపికలు నిర్వహించారు. డిసెంబర్‌లో మంచిర్యాలలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. అనంతరం క్రీడాకారులకు సర్టిఫికెట్లను అందజేశారు.

ధర్నా చేయడం సిగ్గుచేటు

నెల్లికుదురు: ఎక్కడో లగచర్లలో జరిగిన సంఘటనపై మానుకోటలో ధర్నా చేయడానికి కేటీఆర్ కోర్టు ద్వారా అనుమతి తెచ్చుకోవడం సిగ్గుచేటని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు హెచ్.వెంకటేశ్వర్లు తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో యాకయ్య, కొమురెల్లి, నర్సయ్య, నాగయ్య, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

వరి నారుమళ్లలో ఏఓ క్షేత్ర ప్రదర్శన

గార్ల: చలి ప్రభావం వలన యాసంగి వరి నారుమళ్లలో సాయంత్రం నీటిని తీసి, ఉదయం నీటిని పెట్టుకోవడం ద్వారా నారు ఏపుగా ఎదుగుతుందని మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు సూచించారు. శుక్రవారం గార్ల సమీపంలోని శీలంశెట్టి రమేశ్ వరి నారుమడిలో ఆయన క్షేత్ర ప్రదర్శన చేశారు. ఏఓ వెంట ఏఈఓ కిరణ్, రైతులు పాల్గొన్నారు.

26న నిరసన ప్రదర్శన

గార్ల: కార్మిక చట్టాలు, హక్కులను నిర్వీర్యం చేసిన కేంద్రప్రభుత్వం తీరును నిరసిస్తూ నేడు మండల కేంద్రాల్లో ఈనెల 26న జిల్లా కేంద్రంలో ఎస్‌కేఎం సంఘం ఆధ్వర్యంలో చేపట్టే నిరసన ప్రదర్శనను జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి జి.సక్రు శుక్రవారం పిలుపునిచ్చారు.

హామీలను అమలు చేయాలి

నెహ్రూసెంటర్: రాష్ట్రంలో గ్రామీణ పేదలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య డిమాండ్ చేశాడు. శుక్రవారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో కుర్ర మహేష్, వంగూరి వెంకటేశ్వర్లు, యాకుబ్, బాణాల రాజన్న, చేపూరి గణేష్ పాల్గొన్నారు.

జీవనభృతి కల్పించాలి

కొత్తగూడ: వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి రూ.12వేల జీవనభృతి కల్పించాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరన్న కోరారు. ఈమేరకు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

రైళ్లకు హాల్టింగ్ కల్పించాలి

డోర్నకల్: డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో పలు రైళ్లకు హాల్ట్ కల్పించాలని మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, పట్టణ అధ్యక్షుడు కాలా సుమేర్‌చంద్‌జైన్, నాయకులు లాలూనాయక్, బోడా హరిలాల్, మైనుపాషా శుక్రవారం హైదరాబాద్‌లో ఎంపీ బలరాంనాయక్‌ను కలిసి వినతిపత్రం అందించారు.

తప్పిన పెనుప్రమాదం

దంతాలపల్లి: మండలంలోని పెద్దముప్పారం గ్రామానికి చెందిన ఓ రైతు ఓ రైతు శుక్రవారం తన పొలంలో గడ్డి కాల్చేందుకు పొలంలో పెట్టిన మంటతో 33 కేవీ విద్యుత్ లైన్‌కు పెను ప్రమాదం తప్పింది. కాలిన చెట్టు దంతాలపల్లి విద్యుత్ ఉపకేంద్రం నుంచి పెద్దముప్పారం గ్రామంలో ఉన్న విద్యుత్ ఉపకేంద్రానికి సరఫరా చేసే 33కేవీ లైన్‌పై ఒరిగింది. సమాచారం అందుకున్న ఏఈ ప్రవీణ్ జేసీబీ సహాయంతో చెట్టును పక్కకు నెట్టి విద్యుత్ లైన్ పునరుద్ధరించాడు.

ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయాలి

కేసముద్రం: కొత్తగా ఏర్పాటైన ఇనుగుర్తి మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మార్తనేని పాపారావు డిమాండ్ చేశాడు. శుక్రవారం ఇనుగుర్తి మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి వెంకన్న, పార్టీ గ్రామ కార్యదర్శి ఆవుల వెంకన్న, కావటి నర్సయ్య, నీరుటి జలేందర్, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

బయ్యారం: మండల కేంద్రంలోని 24గంటల పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న పలు పోస్టులను భర్తీ చేయాలని పీవైఎల్ రాష్ట్ర నాయకుడు తుడుం వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. శుక్రవారం ఆయన మాట్లాడారు. వైద్యసిబ్బంది లేకపోవడంతో ప్రాథమిక వైద్యం అందుబాటులో లేని పరిస్థితి ఉందన్నారు.

గిరిజనులను మోసగించిన బీఆర్ఎస్



తొర్రూరు: అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ గిరిజన సమస్యలను గాలికి వదిలేసిందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్ అన్నారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సంతోష్ మాట్లాడుతూ.. లగచర్ల అంశాన్ని రాజకీయంగా వాడుకుని లబ్ధి పొందేందుకు గులాబీ పార్టీ చూస్తోందని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో రవినాయక్, మహేందర్, సాగర్, రాంలాల్, సంపత్ పాల్గొన్నారు.

'బలవంతపు భూసేకరణను అడ్డుకుంటాం'

నెహ్రూసెంటర్: రాష్ట్ర వ్యాప్తంగా వివిధ అభివృద్ధి పనుల పేరుతో రైతుల నుంచి బలవంతంగా చేపడుతున్న భూసేకరణను అడ్డుకుని తీరుతామని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రంగయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఈనెల 26వ తేదీన రైతు సంఘాల ఆధ్వర్యంలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పాయం చంద్రన్న, జగ్గన్న, యాకయ్య, ఎల్లయ్య, భిక్షం పాల్గొన్నారు.

यूनियन बैंक Union Bank of India **కేసముద్రం శాఖ** (భారత ప్రభుత్వరంగ సంస్థ)

మార్కెట్ రోడ్, ఇ.నెం.4-198/9, కేసముద్రం స్టేషన్, కేసముద్రం మండలం, మహబూబాబాద్ జిల్లా, తెలంగాణ-506 112.

అమ్మకం గురించి తెలియజేస్తూ రుణగ్రహీతకు నోటీసు (30 రోజుల నోటీసు)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 6(2)/8(6)

దిగువ వారికి, రుణగ్రహీత: **శ్రీమతి మంచన జ్యోతి, భర్త: ప్రశాంత్,** ఇ.నెం.3-165/2, ZPSS స్కూల్ సమీపాన, కేసముద్రం స్టేషన్, కేసముద్రం మండలం, మహబూబాబాద్ జిల్లా, తెలంగాణ-506112.

గ్యారంటార్లు: **శ్రీ మంచన ప్రశాంత్, తండ్రి: (లేట్) రాజన్న,** కేసముద్రం స్టేషన్, కేసముద్రం మండలం, మహబూబాబాద్ జిల్లా, తెలంగాణ-506112.

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద బ్యాంకుకు బకాయిలు రాబట్టుకొనుటకు **మంచన జ్యోతి** కి చెందిన ఆస్తి అమ్మకం.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కేసముద్రం శాఖ, మార్కెట్ రోడ్, ఇ.నెం.4-198/9, కేసముద్రం స్టేషన్, కేసముద్రం మండలం, మహబూబాబాద్ జిల్లా, తెలంగాణ-506112, సెక్యూర్డ్ క్రెడిటార్ వారు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 లోని సెక్షను 13(2) క్రింద యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కేసముద్రం శాఖ యొక్క సెక్యూర్డ్ క్రెడిటార్లు నిర్దిష్ట గడువులోగా బకాయిలు చెల్లించాలని **తేది: 29-2-2024** గల డిమాండ్ నోటీసు మీకు జారీ చేశారు. నిర్దిష్ట గడువులోగా సదరు నోటీసుకు కట్టుబడి వుండటంలో మీరు విఫలమైనందున, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 6/8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అధీకృత అధికారి **తేది: 03-08-2024** న సెక్యూర్డ్ ఆస్తులను లాంఛనప్రాయ స్వాధీనం చేసుకున్నారు.

సెక్యూర్డ్ ఆస్తులను లాంఛనప్రాయ స్వాధీనం చేసుకున్న తర్వాత కూడా, మీరు బ్యాంకుకు బకాయిలను చెల్లించలేదు. ఈ ప్రకటన స్వీకరణ తేది నుండి 30 రోజుల తర్వాత బహిరంగ ఇ-వేలం చేపట్టడం ద్వారా దిగువ తెలిపిన ఆస్తిని ఆ విధంగా ఆన్‌లైన్ విధానం ద్వారా అమ్మటకు తప్పనిసరి అయింది. ఆస్తి రిజర్వ్ ధరతో మరియు సర్వీస్ ప్రొవైడర్ వివరాలతో సహా ఇ-వేలం తేది మరియు సమయం నిర్ణయించబడునని, మీకు విడిగా తెలియజేయబడుతుంది.

అందువలన, అమ్మకం నోటీసు ప్రకారం తేదీకి ముందు బ్యాంక్ ద్వారా జారీ చేయబడిన తదనంతర వడ్డీ, వ్యయాలు, ఛార్జీలు మరియు ఖర్చులతో సహా బ్యాంకుకు బకాయిలు చెల్లించినట్లయితే ఆస్తి అమ్మకం కోసం తదుపరి చర్య తీసుకోనబడదు మరియు సదరు చట్టంలోని సెక్షన్ 13(8) లో నిర్దేశించిన విధంగా మీ ఆస్తిని మీరు తిరిగి పొందగలరు.

ఆస్తి షెడ్యూలు:

మహబూబాబాద్ జిల్లా, కేసముద్రం మండలం, కేసముద్రం స్టేషన్, ఇ.నెం.4-487 వద్ద గల 516.62 చ.గజాల విస్తీర్ణం గల నివాస భూమి మరియు భవనం యొక్క EMD **సరిహద్దులు: ఉత్తరం:** గ్రామపంచాయతీ రోడ్డు, **దక్షిణం:** తెరల వెంకటయ్య గోడౌన్, **తూర్పు:** గ్రామపంచాయతీ రోడ్డు, **పడమర:** గ్రామపంచాయతీ రోడ్డు.

ప్రదేశం: కేసముద్రం
తేది: 30-09-2024

సం/- **అధీకృత అధికారి**
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

మహబూబాబాద్ : 9010144453

Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

ఎస్.కె. అన్వర్ పాషా, (S.R) : 7997958185
వి. సతీష్ (S.R) (డోర్నకల్) : 9640394736
ఎం. మురళి, (S.R) (తొర్రూరు) : 7680822646